## క్లుప్తంగా

### ఆలయ భూములు కాపాడాలని వినతి



**కోస్గి:** అభివృద్ధి పేరుతో ఆలయ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని, ఆలయ భూములను కాకుండా, ఇతర స్థలాలను ఎంపిక చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పాతర్లగడ్డ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డును సైతం కబ్జా చేశారని, ఆలయ భూములను కాపాడాలని కోరారు. బీజేపీ నాయకులు సంపల్లి శ్రీనివాస్, తిమ్మాయపల్లి మల్లేష్, బద్రీనాథ్‌తోపాటు నాగరాజు యువకులు ఉన్నారు.

**కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రికి వినతి**

**మాగనూర్(కృష్ణా):** వీరశైవ సమాజానికి చెందిన కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న ఆధ్వర్యంలో కృష్ణా మండలం హిందుపూర్‌లోని మహాత్మా బసవేశ్వర విగ్రహానికి పూల మాల వేశారు. ఆయన మంగళవారం హిందూపూర్ మీదుగా కర్ణాటకలోని యాద్గిరికి వెళ్తున్న సందర్భంగా మండల వీరశైవసమాజం వారి విజ్ఞప్తి మేరకు ఆయన పాల్గొని మాట్లాడారు.. బసవేశ్వరుడు సమసమాజ స్థాపన కోసం పోరాటం చేశారని కొనియాడారు.. అనంతరం నాయకులు కృష్ణా రైల్వేస్టేషన్‌లో కొన్ని రైళ్లను నిలుపడం లేదని, వాటిని నిలిపే విధంగా చూడాలని వినతిపత్రం అందజేశారు. శివరాజ్‌పటేల్, సోంశేఖర్‌గౌడ్, రామకృష్ణ, మల్‌రెడ్డి, ఆంజనేయులు, నల్లే నర్సప్ప, సుగురురెడ్డి, ఈశ్వరగౌడ్ బసన్నగౌడ్, పాల్గొన్నారు.

### వసతి గృహాల తనిఖీ



**కోస్గి:** గుండుమాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలను, పాఠశాలలను మంగళవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్‌లో శిథిలావస్థకు చేరిన తరగతి గదులను పరిశీలించి ఆరు అదనపు గదులను మంజూరు చేయించి నిర్మిస్తామన్నారు. ఎస్సీ బాలుర వసతిగృహానికి నూతన భవనం కోసం, గుండుమాల్–పగిడియాల్ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి సాయిప్రకాష్ రెడ్డి, నాయకులు సురేష్ రెడ్డి, విక్రంరెడ్డి, సుధాకర్ రెడ్డి ఉన్నారు.

### షీటీంపై అవగాహన కలిగి ఉండాలి



**నారాయణపేట రూరల్:** మహిళలు, బాలికలు తప్పకుండా షీటీమ్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని షీటీం సభ్యులు బాలరాజు అన్నారు. పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అమ్మాయిలను వేధిస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. షీటీం బృంద సభ్యురాలు అమీనా, చెన్నయ్య, పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

### 9న ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు

**నారాయణపేట రూరల్:** పట్టణంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఈనెల 9న అండర్ 17 స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహించే ఈ పోటీలలో పాల్గొని విద్యార్థులు 2008 జనవరి 1నాటికి పుట్టినట్లు ధృవీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9100753683 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### దరఖాస్తుల స్వీకరణ

**దామరగిద్ద:** మండలంలోని వివిధ గ్రామాల రైతులకు వివిధ కారణాలతో నిలిచిన వారికి రుణమాఫీ వర్తింపజేసేందుకు ప్రభుత్వం మండల నోడల్ అధికారుల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తుంది. మంగళవారం వ్యవసాయ అధికారి హరిత ఆయా క్లస్టర్ పరిధిలోని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈనెల 5లోపు రేషన్‌కార్డు లేని వారందరూ దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఏఈఓ భార్గవి, గోపాల్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### హైడ్రా అమలు చేయాలి

**మరికల్:** జిల్లాకు ముఖద్వారంగా ఉన్న మండలంలోని కబ్జాకు గురైన చెరువులు, కుంటలను కాపాడేందుకు హైడ్రాను అమలు చేయాలని కాంగ్రెస్ నాయకులు హరీష్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నోఏళ్ల రియల్‌ఎస్టేట్ వ్యాపారుల చేతిలో అక్రమణకు గురవుతున్న చెరువులు, కుంటలను కాపాడేవారు లేక అవి కనుమరుగవుతున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంచలనం రేపుతున్న హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి కబ్జాకు గురైన ప్రతి చెరువును కాపాడి, భవిష్యత్ తరాలకు జలనీటి వనరులను అందించాలని కోరారు.

# రైతులు సుభిక్షంగా ఉండాలి



నర్వ ఊర చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**నర్వ:** నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు అన్ని మండలాల్లో చెరువులు, కుంటలు నిండుగా పారుతున్నాయని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఊర చెరువును ఆయన పరిశీలించి, వాగు అలుగు వద్ద పారుతున్న నీటిలో నిలబడి పూలు చల్లుతూ, నీటికి పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. అన్ని వర్గాలు సంతోషంగా ఉండాలంటే రైతులు బాగుండాలే... రైతులు బాగుండాలంటే.. సుభిక్షంగా పంటలు పండాలన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి నియోజకవర్గంలోని ప్రతి చెరువు, కుంటలు నిండి జలకళ సంతరించిందన్నారు. దీంతో సాగునీరు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అనంతరం జూనియర్ కళాశాల నిర్మాణం పనులు జరుగుతున్న జాండ్రాగుట్ట వద్ద పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి వచ్చే అకాడమిక్ ఇయర్‌కు భవనాలను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు మక్తల్ మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు చంద్రకాంత్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, రవీందర్‌రెడ్డి, వివేక్‌వర్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, అశోక్‌గౌడ్, హన్మంతురెడ్డి, మల్లేష్ తదితరులున్నారు.

**రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక**

**మక్తల్:** పట్టణంలో లిటిల్ ఏంజిల్ ఉన్నత పాఠశాలకు చెందిన అనిత, జయలలిత, కీర్తి, అజయ్‌కుమార్ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికకావడంతో మంగళవారం విద్యార్థులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అభినందించి, శాలువాతో సన్మానం చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 13, 15న నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు సహకారం చేసిన పీఈటీ దామోదర్‌ను సన్మానం చేశారు. అనంతరం విశ్రాంతి పీఈటీ గోపాలంను పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, గోవర్ధన్, రవికుమార్, సురేష్, పాఠశాల డైరెక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

## కొండారెడ్డిపల్లి చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

**నారాయణపేట రూరల్:** వినాయక చవితి, నిమజ్జన ఉత్సవాలను పురస్కరించుకొని అధికారుల బృందం గణేష్ మార్గం పరిశీలించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వివిధ శాఖల అధికారుల బృందం వినాయక మండపాల ఏర్పాటు, శోభాయాత్ర నిర్వహించే మార్గం, నిమజ్జనం చేసే కొండారెడ్డిపల్లి చెరువులను పరిశీలించారు. ముందుగా పాతబస్‌స్టాండ్ నుంచి మహంకాళి వీధి గుండా దూల్ పేట, సుభాష్ రోడ్ మీదుగా గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే కొండారెడ్డిపల్లి చెరువు వద్దకు వెళ్లి చెరువు వద్ద పరిస్థితులను పరిశీలించారు. మాసుమల్లి దర్గా వద్ద శివాజీనగర్ మసీదు వద్ద పోలీసుభద్రతపై డీఎస్పీ లింగయ్య పర్యవేక్షణ చేశారు. శివాజీ నగర్ రోడ్డు మరమ్మతు విషయం లో మున్సిపల్ అధికారులతో డీఎస్పీ, ఆర్డీఓ చర్చించారు. సరాఫ్ బజార్ వద్ద తాగునీటి వసతి కల్పన గురించి అధికారులకు సూచనలు చేశారు. చివరగా కొండారెడ్డి పల్లి చెరువు వద్ద బారికేడ్లను, క్రేన్లను ఎక్కడ వైపు ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుందని అధికారులతో సమాలోచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ రాములు, మున్సిపల్ కమిషనర్ సునీత, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఏఈ మహేష్, డీఎల్పీఓ సుధాకర్ రెడ్డి, నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం



**మద్దూరు:** ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్లు కోతకుగురవ్వడంతో బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా.. మంగళవారం మహబూబ్‌నగర్ డిపోకు చెందిన బస్సు ఎక్కమేడ్ వద్ద ప్రభుత్వ పాఠశాల మలుపు వద్ద ఎదురెదురుగా రెండు బస్సులు రావడంతో సైడ్ తీసుకునే క్రమంలో రోడ్డు దిగడంతో బస్సు గుంతలో పడింది. దీంతో బస్సులోని ప్రయాణికులకు ఏలాంటి ప్రమాదం జరగలేదు.

### ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**మాగనూర్:** వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ పి. అశోక్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవాలపై శాంతి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పండగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. గణేష్ నిర్వాహకులు ఏర్పాటు చేసే ప్రదేశం వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందుకు సంబంధించిన కాపీ ఇవ్వాలన్నారు. నిమజ్జనం చేసే తేదీని తప్పక అందులో సూచించాలన్నారు. మండలపాల చుట్టుపక్కల ఉన్న వారికి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

### మంత్రి పదవి ఇవ్వాలని పాదయాత్ర

**మక్తల్ :** ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి రావాలని నియోజకవర్గంలోని అమరచింత మండలం చంద్రనాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు హన్మంతునాయక్, సూర్యనాయక్‌లు మంగళవారం తండానుంచి మక్తల్‌కు దాదాపు 45కిలో మీటర్లు పాదయాత్ర చేపట్టారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామిలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారి అనంద్‌స్వామి హన్మంతునాయక్, సూర్యనాయక్‌లను శాలువాతో సన్మానం చేశారు.

## భవిత సెంటర్ ద్వారా మెరుగైన సేవలు



వివరాలు తెలుసుకుంటున్న విద్యాశాఖ అధికారులు

**నర్వ:** భవిత సెంటర్ ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు మెరుగైన సేవలు అందించాలని కో–ఆర్డినేటర్ రాజేందర్‌కుమార్ అన్నారు. మంగళవారం రాంపూర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత సెంటర్‌ను ఆయన జీసీడీఓతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాంపూర్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో చిన్నారులకు ఎలాంటి సేవలు అందుతున్నాయని ఐఈఆర్పీ రవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తుర్బా గురుకుల పాఠశాల, ఎమ్మార్సీని తనిఖీ చేపట్టారు. కేజీబీవీలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను వారు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. సెక్టోరియల్ అధికారి నాగర్జునరెడ్డి, జీసీడీఓ పద్మనళిని, కేజీబీవీ ప్రిన్సిపల్ శిరిష తదితరులున్నారు.

### ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



**మాగనూర్:** మండల ఎంపీడీఓ కార్యాలయాన్ని స్టేట్ టెస్ టీం తనిఖీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రమేష్‌కుమార్ తెలిపారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్, మండల ఫండ్, గ్రామ పంచాయతీ ఫండ్‌ను ఏవిధంగా ఖర్చు చేశారు అనే అంశంపై తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. మంగళవారం వారు మండలంలోని గురువలింగంపల్లి, నేరడగం పంచాయతీలలోని రికార్డులను పరిశీలించి, గ్రామాల అభివృద్ధి కి నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకున్నారా ? లేదా అనే విషయంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 'రాధ హత్యకు సమాధానం చెప్పాలి'



నివాళులు అర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

**కోస్గి:** ఇన్‌ఫార్మర్ పేరుతో దళిత బిడ్డ రాధను హత్య చేసిన మావోయిస్టులే ఈ హత్యకు తగిన కారణాలతో సమాధానం చెప్పాలని పలు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు దళిత సంఘాల ఐక్య వేదిక, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక శివాజీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రాధ చిత్రం పటం ఉంచి నివాళులర్పించారు. పలు దళిత సంఘాల నాయకులు సీబీ వెంకటేష్, లక్ష్మణ్, కనకప్ప, నర్సింహ, వెంకటేష్, బుగ్గప్ప, రాంచంద్రయ్య, విశ్వప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

### చెరువుకు పూజలు

**మద్దూరు:** మన్నాపూర్ చెరువు నిండి అలుగు పారడంతో మంగళవారం గ్రామస్తులు కట్ట మైసమ్మకు పూజలు నిర్వహించారు. చెరువు చాలా ఏళ్ల తర్వాత అలుగు పారడంతో గంగమ్మకు, కట్టమైసమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటయ్య, మహిపాల్ పాల్గొన్నారు.



## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మద్దూరు:** వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓ సౌభాగ్యలక్ష్మి ప్రజలకు సూచించారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు విధిగా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం మండలంలోని నందిపాడ్‌లో డెంగీ కేసునమోదు కావడంతో మండల వైద్య సిబ్బందితో కలిసి గ్రామాన్ని పరిశీలించారు. డెంగీ కేసునమోదైన కుటుంబ సభ్యులతో మాట్లాడారు.. వ్యాధి నిర్ధారణ జరగడంతో చికిత్స నిర్వహించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శి పుష్పకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయకుమార్‌రెడ్డి, ఆశ, ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో అమావాస్య పూజలు



పేటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కోస్గిలో నంద దీపం కార్యక్రమంలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

**నారాయణపేట రూరల్:** జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో మంగళవారం అమావాస్య పూజలు వైభవంగా కొనసాగాయి. రాష్ట్ర సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తరనామావళి, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు చేశారు. భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేపట్టారు. అదే విధంగా పట్టణంలోని అయ్యప్పస్వామి, సింగార్ బేస్ శివలింగేశ్వర ఆలయం, మహంకాళివీధి శివాలయం, సుభాష్‌రోడ్డు హనుమాన్ మందిరం, జిలాల్‌పూర్ కర్రెప్పస్వామి, బైరంకొండ శివాలయం, ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

**భక్తి శ్రద్ధలతో వీరభద్ర స్వామి జయంతి**

పట్టణంలోని సరాఫ్ బజార్ బసవేశ్వర స్వామి ఆలయంలో వీరభద్రస్వామి జయంతిని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు.. స్వామివారికి రుద్రాభిషేకం, అష్టోత్రం పుష్పఅలంకరణ చేపట్టి మహామంగళహారతి నిర్వహించారు. అలాగే మండలంలోని కోటకొండ శివారులో శ్రీ భూశ్రీనివాస సన్నిధానంలో శ్రీరఘుప్రేమ తీర్థుల 81వ ఆరాధన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు.. స్వామివారి ఉత్సవ విగ్రహంతో పల్లకి సేవా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త బుసయ్యస్వామి, అర్చకులు మంజునాథస్వామి, శివ స్వామి, బాగోడి మల్లు, శంకర్, జయప్ప, విశ్వనాథ్, రవి పాల్గొన్నారు.

**వీరభద్రేశ్వరుడి ఆలయంలో**

**కోస్గి:** గుండుమాల్ మండల పరిధిలోని అమ్లికుంట్లలో వీరభద్రేశ్వరుడి ఆలయంలో శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఇందులో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

**వైభవంగా ఉట్టికొట్టు వేడుకలు**

**కోస్గి:** పట్టణంలోని కురిహిణి శెట్టి (జాండ్ర సంఘం) ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా ప్రతియేటా నిర్వహించే పెరుగు వసంత ఉట్టికొట్టు వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇదే క్రమంలో మండల పరిధిలోని సర్జఖాన్‌పేటలో సైతం పెరుగు వసంతం వేడుకల సందర్భంగా యువకులు ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. సంఘం ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి

**నారాయణపేట:** మహిళలు చిన్న చిన్న కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని వాటిని, మార్కెటింగ్ చేయించే బాధ్యత తమదని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి భరోసానిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పట్టణ మహిళ సమాఖ్య ఆర్‌పీల సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్యాంకుల ద్వారా మహిళ సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. త్వరలోనే పట్టణంలోని మహిళ సంఘాల సభ్యులందరితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించబోతున్నామన్నారు. పట్టణ మహిళ సమాఖ్య కమిటీ ఏర్పాటుచేసి మూడేళ్లు అవుతున్నందున నూతన కమిటీని ఎన్నుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

**సమస్యలు పరిష్కరించండి..**

ఇటీవల కురిసిన భారీ వర్షానికి ప్రజలు ఇబ్బందులు తెలుసుకునేందుకు పలువార్డులో అధికారులు సందర్శించి తెలుసుకొని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. వార్డు అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా నిత్యం వార్డుల్లో పర్యటించాల్సిన బాధ్యత మీదే అన్నారు.

**బ్రిడ్జి నిర్మాణం చేపడుతాం..**

యాద్గీర్‌రోడ్‌లోని ప్రతిభ కళాశాల సమీపంలో వరద ప్రాంతమైన ఏరియాలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ బ్రిడ్జి వద్ద ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసి విద్యుత్ అసౌకర్యం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్, కమిషనర్ సునీత, కౌన్సిలర్లు ఉన్నారు.

**వీరభద్రేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

**దామరగిద్ద:** మండలంలోని క్యాతన్‌పల్లిలో వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాస ముగింపు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, శరణ్యానాయక్, లక్ష్మణ్, రఘు, నారాయణ, బస్వంత్‌రాజ్ పాల్గొన్నారు.

## ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడాలి



నర్వలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎం రామకృష్ణ



మాట్లాడుతున్న నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి

**నర్వ:** యంగ్ ఒరటోర్ క్లబ్ ద్వారా విద్యార్థులకు సులభంగా ఆంగ్లం అర్థమయ్యేటట్లు చేయాలని నోడల్ అధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇంగ్లీష్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సులభంగా, సరళంగా, ధారళంగా ఆంగ్లం అర్థమయ్యి, మాట్లాడే విధంగా ఉపాధ్యాయులకు ఈ మండలస్థాయి ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు రఘువర్మగౌడ్, ప్రదీప్, సీఆర్పీలు రోజా, నర్సింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**మాగనూర్:** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఇంగ్లిష్ సులభంగా ఆంగ్ల అర్థమయ్యేటట్లు చేయాలని మండల నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇంగ్లీష్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాల నుంచి ఒక ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు నేర్పించాలన్నారు. గెజిటెడ్ హెచ్‌ఎం శంకరాచారి, ఆర్‌పీ ప్రశాంత్ కుమార్, భవ్యశ్రీ, సీఆర్పీ కృష్ణయ్య పాల్గొన్నారు.

**ధన్వాడ:** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలకు యూడైస్, డీసీఎఫ్ క్యాప్చర్ ఫార్మట్ ఫిల్లింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెక్టోరియల్ అధికారి నాగర్జున్‌రెడ్డి, సీఎంఓ రాజేందర్‌కుమార్, ఎంఈఓ అంజలిదేవి, గ్రాయతి, సీఆర్‌పీలు నారాయణ, వెంకట్రాములు, మాసన్న, శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ధార్మిక ప్రవచనంలో సిద్ధి లింగయ్య స్వామి, మహిళలు

**కోస్గి:** ప్రతి మానవుడు జీవితంలో ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతతను పొందవచ్చునని ధార్మిక ప్రవచన కర్త శివశ్రీ మడపతి సిద్ధిలింగయ్య స్వామి అన్నారు. స్థానిక బసవేశ్వర మందిరం, మల్లికార్జునస్వామి ఆలయాలలో శ్రావణమాసం సందర్భంగా చేపట్టిన నందజ్యోతి ముగింపు ఉత్సవం మంగళవారం వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు కొంత సమయాన్ని దైవ సేవకు కేటాయించాలన్నారు. అనంతరం శివభక్తి తత్వం అంశాలపై అధ్యాత్మిక సందేశం ఇచ్చారు.

అలాగే వీరశైవ సమాజ అక్కా మహాదేవి సంఘం ఆధ్వర్యంలో మహిళలు శివ సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం మండల ప్రతినిధులు, అక్కమహాదేవి మహిళ మండలి ప్రతినిధులతోపాటు మహిళ మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం మధ్యాహ్నభోజనం వడ్డించాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీఓ

**మాగనూర్ (కృష్ణా):** కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని కృష్ణా మండల ఎంపీడీఓ జానయ్య అన్నారు. విద్యార్థులకు సరైన భోజనం అందించే విధంగా చూడాలని ఎస్‌ఓ శాలినికి ఆయన సూచించారు. మంగళవారం మండలంలోని హిందూపూర్‌లో కస్తుర్బా గాంధీ బాలిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలతోపాటు తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలో పలు సమస్యలు నెలకున్నట్లు గుర్తించామన్నారు. సమస్యలపై పీఆర్ ఏఈ మారుతి ద్వారా ఎస్టిమేట్ వేయించామని త్వరలోనే సమస్యలు పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలి



వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

**నారాయణపేట:** పంటలు నష్టపోయిన ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, అంజిలయ్యగౌడ్, బలరాంలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని బొమ్మనుపాడు శివారులో నష్టపోయిన పంటలను వారు పరిశీలించి రైతులతో మాట్లాడారు.. అనంతరం స్థానికి వ్యవసాయ అధికారి జానసుధాకర్ కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పంటలను పరిశీలించి నష్టపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సీపీఎం నాయకులు బాల్‌రాం, కాశప్ప, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

**ధన్వాడ:** మండలంలోని ఆయా గ్రామాల్లో అకాల వర్షాలతో పత్తి, వరి పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవాలని మంగళవారం మాజీ ఎంపీటీసీ గౌనిశ్రీనివాసులు స్థానిక తహసీల్దార్ సింధుజాకు రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై వ్యవసాయశాఖ అధికారులు స్పందించి నష్టపోయిన పంటలను పరిశీలించి, ఉన్నత అధికారులకు నివేదిక పంపించాలని కోరారు. అంజన్న, నర్సింహులు, అశోక్, రఘు, ఆశన్న, రాజు, రాములు ఉన్నారు.

## మరమ్మతు చేపట్టాలని ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యాపారస్తులు

**నారాయణపేట:** స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో వానాకాలం వస్తే చాలు దుఖాణాలపై కప్పు నుంచి నీరుకారుతుందని మరమ్మతు చేపట్టాని వ్యాపారస్తులు, కమిషన్ ఏజెంట్లు మంగళవారం మార్కెట్ కార్యదర్శి భారతి ముందు ఆందోళన వ్యక్తంచేశారు. వ్యాపారస్తులు, కమిషన్ ఏజెంట్లు అందరూ కలిసి ఏకతాటిగా.. ఒక్కసారిగా మార్కెట్ కార్యదర్శి చాంబర్‌లోకి చేరుకున్నారు. వ్యాపారస్తులు కమిషన్ ఏజెంట్లు రావడంతో ఏమిటి విషయమంటూ కార్యదర్శి వారిని ప్రశ్నించింది. ఇందుకు స్పందించిన మార్కెట్ కార్యదర్శి సమాధానం ఇస్తూ.. గతేడాది 47 దుఖాణాలకు మరమ్మతులు చేయించేందుకు రూ.1.14 కోట్లు ప్రతి పాదనలు పంపిస్తే మంజూరైందని, టెండర్లు నిర్వహించగా కాంట్రాక్టర్ పనులుచేయకపోవడంతో ఆగిపోయిందన్నారు. త్వరలో వచ్చే నూతన పాలకవర్గం చొరవతో దుఖాణాలు మరమ్మతు చేయిస్తామని హామీ ఇచ్చారు. మరమ్మతు విషయంపై కలెక్టర్, ఎమ్మెల్యే, జేడీఎంల దృష్టికి తీసుకెళ్తామని వ్యాపారస్తులు కార్యదర్శికి చెప్పుకొచ్చారు. మార్కెట్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించినట్లు కార్యదర్శి వివరించారు. వ్యాపారస్తులు, కమిషన్ ఏజెంట్లు పవన్‌కుమార్ లాహోటి, సంపత్‌కుమార్‌ధారక్, వేణు, కన్నాజగదీష్,రఘు తదితరులు ఉన్నారు.